క్లుప్తంగా

చెత్త తొలగింపు

సాక్షి ఎఫెక్ట్

రాజుపాలెం: మండలంలోని అనుపాలెంలో పార్కు సెంటర్‌లో వేసిన చెత్త దిబ్బను తొలగించారు. గ్రామంలో పారిశుద్ధ్యం చేపట్టినట్లు ఈవోపీఆర్డీ పగడాల ముక్కంటి మంగళవారం తెలిపారు. సోమవారం సాక్షి దినపత్రికలో మురుగు..ఆరోగ్యం కనుమరుగు అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

బెల్లంకొండ: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వై.హనుమారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపీపీ చెన్నుపురెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొనాలని సూచించారు.

ద్విచక్ర వాహనం స్వాధీనం



క్రోసూరు: క్రోసూరు నాలుగురోడ్ల సెంటర్‌లో సోమవారం రాత్రి ఎస్‌ఐ కె.నాగేంద్రరావు, పోలీసు సిబ్బంది వాహనాలు తనిఖీ చేపట్టారు.తనిఖీల్లో ద్విచక్రవాహనం దొంగిలించి తీసుకొస్తున్న దొంగ తమకు చిక్కినట్లు ఎస్‌ఐ మంగళవారం తెలిపారు. సత్తెనపల్లి రూరల్ మండలం కందులవారిపాలెం గ్రామానికి చెందిన ఎలిసెట్టి నరేంద్రబాబు ఎన్టీఆర్ జిల్లా వేదాద్రి నుంచి యూనికాన్ పై వస్తుండగా తనిఖీ చేశారు. వాహన ధ్రువ పత్రాలు విచారించగా దొంగిలించినట్లు తెస్తున్నట్లు తెలిసిందన్నారు. దీంతో వాహనం సీజ్ చేసి నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

చద్ది కార్యక్రమం ప్రారంభం



బెల్లంకొండ: మాలధారణ చేపట్టిన దీక్ష స్వాములకు మండల కేంద్రంలోని శివాలయంలో మహా అన్నదానం (సద్ది) కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించినట్లు గురుస్వామి కుందుర్తి బాల వీరాంజనేయులు తెలిపారు. దాతల సహకారంతో ఈ నెల 15 నుంచి అక్టోబర్ 24 వరకు 41 రోజుల పాటు ప్రతిరోజు స్వాములందరికీ అన్నదాన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. మాల ధరించిన వారందరూ చద్ది కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

టీడీపీలో వర్గ విభేదాలు

రాజుపాలెం: మండలంలోని రెడ్డి గూడెంలోని తెలుగుదేశం పార్టీలో విభేదాలు భగ్గుమన్నాయి. టీడీపీకి చెందిన కొంతమంది నాయకులు మంగళవారం రెడ్డిగూడెంలో జరిగిన పల్లె పండుగ వారోత్సవాల్లో పాల్గొనలేదు. పార్టీ నాయకులు, మండల కన్వీనర్, మండలస్థాయి నాయకులు తమకు మాటమాత్రం చెప్పలేదని వారు అలకబూనారు. గ్రామ మాజీ అధ్యక్షుడికి, ప్రస్తుత గ్రామ అధ్యక్షుడికి, మాజీ ఎంపీటీసీకి, టీడీపీ గెలుపుకోసం కష్టపడిన నాయకులకు చెప్పలేదని కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. ఈ విషయంపై పార్టీ పెద్దలతోను, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణతో మాట్లాడుతామని చెప్పారు.

జేఏఓగా ఎన్‌ఎల్ రాజు



ముప్పాళ్ళ(సత్తెనపల్లి): సత్తెనపల్లి మున్సిపాలిటీ కార్యాలయం జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా ఎన్.ఎల్.రాజు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. జగ్గయ్యపేట మున్సిపాలిటీలో పనిచేస్తూ ఇటీవల జరిగిన బదిలీలో భాగంగా సత్తెనపల్లి మున్సిపాలిటీ జేఏఓగా వచ్చారు.

ఈ-పంట జాబితాలో సవరణకు అవకాశం



నకరికల్లు: ఈ-పంట నమోదులో తప్పొప్పులు సరిచేసేందుకు సచివాలయాలు, రైతు సేవా కేంద్రాల్లో ముసాయిదా జాబితాను ప్రదర్శనకు ఉంచినట్లు మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు తెలిపారు. మండలంలోని చాగల్లు, కండ్లకుంట గ్రామాల్లో ముసాయిదా జాబితాను మంగళవారం తనిఖీ చేశారు. ఈ నెల 16 వరకు ఈ -పంట నమోదు చేసుకున్న రైతుల జాబితా అందులో ఉందన్నారు. సరవణ ఉన్నట్లయితే.. రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బంది దృష్టికి రాత పూర్వకంగా తీసుకురావాలని చెప్పారు. వ్యవసాయ సహాయకులు కె.శ్రీనివాస్, కె.కృష్ణ, వీఆర్వో టి.పీరా, రైతులు పాల్గొన్నారు.

'అగ్రి' చేయాల్సిందే.. గతం రైతులకు ఘనం

- రైతు ప్రయోజనాలకు అగ్రి టెస్టింగ్ ల్యాబ్
- క్రోసూరు మార్కెట్ యార్డులో నిర్మాణం
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అందుబాటులోకి
- అన్నదాతలు, పశుపోషకులకు వెన్నెదన్ను



క్రోసూరు మార్కెట్ యార్డులోని డాక్టర్ వైఎస్సార్ అగ్రి, పశువ్యాధి నిర్ధారణ ల్యాబ్



ల్యాబ్‌లో ఎరువుల పరీక్షల ప్రయోగశాల



పశు వ్యాధి నిర్ధారణ జరిపే ల్యాబ్

క్రోసూరు: భారత్ వ్యవసాయాధిరిత దేశం. పాడి పంటలు సమృద్ధిగా ఉంటేనే దేశం వృద్ధి చెందుతుంది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు వ్యవసాయం, అనుబంధ రంగాలే అధిక జీవనాధారం. అలాంటి అన్నదాతలకు అన్ని విధాలుగా సాయం అందించాలని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనేక సంస్కరణలు చేపట్టింది. రైతుల సంక్షేమమే ధ్యేయంగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందించారు. అందుకు నిదర్శనం 2021లో క్రోసూరు మార్కెట్ యార్డులో నిర్మించిన అగ్రి, పశు వ్యాధి నిర్ధారణ లాబ్. జిల్లాలో నియోజకవర్గానికి ఒక అగ్రి ల్యాబ్‌ను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కృషితో పెదకూరపాడు నియోజకవర్గానికి అగ్రిల్యాబ్ సాకరమైంది. రూ.60 లక్షల నిధులతో నిర్మించిన ఈ ల్యాబ్‌లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను పరీక్షిస్తారు. నకిలీలకు అడ్డుకట్ట వేసి రైతులను రక్షించాలన్నదే దీని ముఖ్య ఉద్దేశం. నాణ్యమైన ఎరవులు, విత్తనాలు, పురుగు మందులు అందించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్నది లక్ష్యంగా అగ్రి ల్యాబ్ ఏర్పాటు వెనుక ఉద్దేశం. అలాగే పశువుల వ్యాధి నిర్ధారణ చేసి, అందుకు తగ్గట్టు మందులు అందించేందుకు పశువ్యాధి నిర్ధారణ లాబ్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో ఒక సీనియర్ అనలిస్టు, ఇద్దరు జూనియర్ అనలిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్ విధులు నిర్వహిస్తుంటారు.

రైతులకు ప్రయోజనం..



అగ్రి లాబ్ నియోజకవర్గానికి ఒకటి ఏర్పాటు చేయడం వల్ల రైతులకు ప్రయోజనం చేకూరుతోంది. ఎక్కడికక్కడ పరీక్షలు చేయడం ద్వారా పని సులువు అవుతుంది. అగ్రి ల్యాబ్‌లో ప్రభుత్వం తరుపు నుంచి, రైతులు, వ్యాపారులు, ఇతర సంస్థలు పంపించే విత్తనాలు, ఎరువుల శాంపిల్స్ పరీక్షించి, 15 రోజుల్లో నివేదిక అందిస్తుంటాం. ఇప్పటికీ మొత్తం 750 పరీక్షలు చేశాం.

– వి.హనుమంతరావు, ఏడీఏ, క్రోసూరు

పశువ్యాధి నిర్ధారణ పరీక్షల్లో ప్రథమ స్థానం



క్రోసూరు అగ్రి ల్యాబ్‌లో ఎక్కువ పరీక్షలు జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచాం. పశువుల పేడ, రక్త, పాలు, చర్మ వ్యాధుల పరీక్షలు చేసి సంబంధిత పశువుల వైద్యాధికారులకు రైతుకు సమాచారం అందజేస్తున్నాం. తిరగకట్టే పశువులకు ఉండే లోపాలను నిర్ధారించే ఏబీఎస్ పరీక్షలు, లివర్, కిడ్నీ ఫంక్షన్ టెస్టులు చేస్తున్నాం.

– డాక్టర్ మల్లయ్య, పశు వైద్యుడు, క్రోసూరు

పెరికపాడు, అనంతవరంలో 'పల్లె పండుగ'



అనంతవరం గ్రామంలో షెడ్డు నిర్మాణనికి భూమి పూజ

క్రోసూరు: పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలను మండలంలోని పెరికపాడు, అనంతవరం గ్రామాల్లో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఉపాధి హామీ ఏపీవో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. పశు పోషకుల కోసం షెడ్ల నిర్మించేందుకు భూమి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ ఒక్కో షెడ్డుకు ప్రభుత్వం ఉపాధి హామీ ద్వారా రూ.2.30 లక్షలను మంజూరు చేస్తుందన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ సిబ్బంది, పశు సంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పంటలను కాపాడుకోవాలి



రుద్రవరంలో మాట్లాడుతున్న ఏవో అరుణ

రుద్రవరం(ముప్పాళ్ళ): సాగులో యాజమాన్య పద్ధతులు పాటించి, అధిక వర్షాల నుంచి పంటలను కాపాడుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎమ్.అరుణ చెప్పారు. రుద్రవరం, తొండపి గ్రామాల్లో పొలం పిలుస్తొంది కార్యక్రమం మంగళవారం జరిగింది. పొలంలో నీటి నిల్వల తొలగించే చర్యలను వివరించారు. నేలలో సేంద్రియ కర్బనం పెంచుకోవడం వల్ల గ్లోబల్ వార్మింగ్ వల్ల వచ్చే ఎఫెక్ట్‌ను తగ్గించుకోవచ్చని సూచించారు. పశు వైద్యులు బిల్లా కోటేశ్వరరావు పశుసంవర్ధక శాఖ పథకాల తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు జీ.రాజేష్, ఎమ్.నీలిమ, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కంది పైరులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

బెల్లంకొండ: కంది పైరులో సస్య రక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి కృష్ణయ్య తెలిపారు. మంగళవారం మాచాయపాలెం, బెల్లంకొండ గ్రామాలలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. కంది పంటను పరిశీలించి, మారుక ఆకు చుట్టు పురుగు అక్కడక్కడా ఆశించినట్లు గుర్తించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది వై. శ్యామ్ ప్రకాష్, వి. ప్రత్యుష, ఆయా గ్రామ రైతులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'పల్లె పండుగ' శంకుస్థాపనలు



ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కన్నా

రాజుపాలెం: పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మంగళవారం రెడ్డిగూడెం ఎస్టీ కాలనీలో గల కల్యాణ మండపం ప్రహరీ నిర్మానానికి భూమి పూజ చేశారు. మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. అనంతరం గణపవరం, బలిజేపల్లి, ఇనిమెట్ల గ్రామాలలో సీసీ రోడ్లు, డ్రెయిన్స్ నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు.

మినీ గోకులానికి భూమి పూజ

బెల్లంకొండ: ఎంపీడీవో వై.హనుమారెడ్డి పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం న్యూచిట్యాల, కందిపాడు, మాచాయపాలెం గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మూడు గ్రామాల్లో మినీ గోకులం షెడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఏపీవో కోటమ్మ, సర్పంచ్ భాణావతు నరసింహానాయక్, ఏపీవో కోటమ్మ, పంచాయతీ రాజ్ ఏఈ శేషప్పయ్య, సెక్రటరీ లక్ష్మీబాయి, మండల టీడీపీ అధ్యక్షుడు లక్ష్మీ నారాయణ, నాయకులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో..

గోళ్లపాడు(ముప్పాళ్ళ): మండలంలోని గోళ్ళపాడు, కుందురువారిపాలెం గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మినీ గోకులం షెడ్డు నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. మూడు షెడ్ల నిర్మాణానికి జరిగిన భూమి పూజలో ఎంపీడీవో పీజే విలియమ్స్, ఏపీఓ ఏడుకొండలు, వీఆర్వో దాసు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సత్తెనపల్లి మండలంలో..

సత్తెనపల్లి: మండలంలోని గండ్లూరు గ్రామ పంచాయతీ పరిధిలో పల్లె పండుగ వారోత్సవాలలో భాగంగా రూ. 10 లక్షలతో ఎంపీయూపీ పాఠశాల కాంపౌండ్ వాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఫణిదంలో రూ.6.5లక్షలు, భట్లూరులో రూ.6.5లక్షలు, గుజ్జర్లపూడిలో రూ.6.5 లక్షలతో అంతర్గత సీసీ డ్రైయిన్‌ల నిర్మాణ పనులు ప్రారంభించారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న ఏఓ శ్రీధర్‌రెడ్డి

ముప్పాళ్ళ(సత్తెనపల్లి): ప్రభుత్వ యంత్రాంగంలో పారదర్శకత, జవాబుదారీతనం కోసం సమాచారహక్కు చట్టం అమలు చేస్తున్నారని సత్తెనపల్లి మండల వ్యవసాయాధికారి ఎస్.శ్రీధర్‌రెడ్డి చెప్పారు. పాకాలపాడు గ్రామంలో సమాచార హక్కుచట్టంపై వ్యవసాయశాఖ సిబ్బందికి, రైతులకు అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ సమాచారం హక్కు చట్టం కింద ఏ విధంగా దరఖాస్తు చేసుకోవాలో వివరించారు. వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు యూనిఫాం పంపిణీ



యూనిఫాం పంపిణీ చేస్తున్న దృశ్యం

వినుకొండ(నూజెండ్ల): రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు యూనిఫాం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ చేతుల మీదుగా 200 మంది కార్మికులకు ఈ యూనిఫాంను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీ క్లబ్ సభ్యులు సమాజ అభివృద్ధి కోసం వారు చేస్తున్న స్వచ్ఛంద కార్యక్రమాలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ జి. శ్రీకాంత్‌రెడ్డి, సెక్రటరీ ఏరువ వెంకటనారాయణ, ట్రెజరర్ ఎస్‌కే ముస్తాన్, మాజీ ప్రెసిడెంట్లు ముత్తినేని గిరిబాబు, చిరుమామిళ్ల కోటేశ్వరరావు, అలా శ్రీనివాసరావు, బత్తుల శ్రీనివాసరావు, సాధినేని శ్రీనివాసరావు, జి. నాగరాజు, పెనుగొండ రాజేష్, మాదాల హనుమంతరావు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ శ్రీనివాస్‌రెడ్డి

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని ఎరువులు, పురుగు మందల దుకాణంలో ఏఓ ఎస్.శ్రీనివాస్‌రెడ్డి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎరువులు, పురుగు మందులను విక్రయించే వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తే సహించేది లేదన్నారు. అంతేకాకుండా ఎరువులు, పురుగు మందులు కొనేటప్పుడు తప్పనిసరిగా రసీదులను పొందాలన్నారు. వాటిని భద్రపరుచుకోవటం వలన ఎంతో మేలు జరుగుతుందని ఆయన తెలియజేశారు. వ్యాపారస్తులు ఎరువులు, పురుగు మందుల స్టాక్ రిజిస్టర్‌ను తప్పనిసరిగా మెయింటినెన్స్ చేయాలని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలి



శిశు మందిర్‌లో నివాళులర్పిస్తున్న చిన్నారులు

క్రోసూరు: భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం కలలను విద్యార్థులు సాకారం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. మంగళవారం క్రోసూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగించారు. విద్యార్థులు ఎల్లప్పుడూ అటువంటి కలాం లాంటి త్యాగ ధనులను, విద్యావేత్తలను ఆదర్శంగా తీసుకుని ముందుకుసాగాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రామాంజనేయులు, ఎంఈవోలు ఏకుల ప్రసాదరావు, గణేష్ ఉన్నారు.

అబ్దుల్ కలాం మార్గదర్శి

అమరావతి: గ్రామీణ ప్రాంతం, పేద కుటుంబం నుంచి వచ్చి ప్రపంచవ్యాప్తంగా గుర్తించబడిన శాస్త్రవేత్త, మాజీ రాష్ట్రపతి, భారత రత్న ఏపీజే అబ్దుల్ కలాం అని సరస్వతి శిశుమందిర్ ప్రధానోపాధ్యాయుడు కొలా వెంకట్వేరరావు అన్నారు. మంగళవారం పాఠశాలలో అబ్దుల్ కలాం జయంతి నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అబ్దుల్‌కలాం ఆశయాలు కొనసాగించాలి

నకరికల్లు: డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఆశయాలను విద్యార్థులు కొనసాగించాలని రిటైర్డ్ ఎస్‌ఐ షేక్.చింతపల్లి అబ్దుల్ సత్తార్ అన్నారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని అరబ్బీ మదరసాలో నిర్వహించారు. విద్యార్థినులకు గుండ్లపల్లి ఎంప్లాయిస్ హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం భోజనం ఏర్పాట్లు చేశారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గండు మస్తాన్‌వలి, ఐటీ ప్రొఫెసర్ షేక్.జమాల్ అల్లాబక్షు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



మదర్సాలో అవగాహన కార్యక్రమం

దేశానికి స్ఫూర్తి అబ్దుల్ కలాం

ముప్పాళ్ళ(సత్తెనపల్లి): క్షిపణులు, ఉపగ్రహాల రూపకల్పనతో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం దేశాన్ని శక్తివంతంగా మలిస్తే.. విశేష సేవలు అందించిన వితరణ శీలి రతన్ టాటా అని స్వామి వివేకానంద చైతన్య భారతి సంస్థ కార్యదర్శి కాకాని శ్రీనివాసరావు అన్నారు. రైల్వేస్టేషన్ రోడ్డులోని అబ్దుల్ కలాం విగ్రహం వద్ద అబ్దుల్ కలాం జయంతి నిర్వహించారు. అబ్దుల్ కలాం విగ్రహంతో పాటు రతన్‌టాటా చిత్రపటానికి నివాళులర్పించారు. సంస్థ ఉపాధ్యక్షుడు పుట్టి సాంబశివరావు, సభ్యులు అబ్బూరి సత్యనారాయణ, కోశాధికారి సత్యనారాయణ, దేవరశెట్టి రవి, శీలం ఏడుకొండలు, కాపుగంటి రత్తయ్య, దేసు సోమశేఖర్, ఏజీకేఎం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



అబ్దుల్ కలాం విగ్రహానికి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ నివాళి

అబ్దుల్ కలాం జీవితం ఆదర్శం

బెల్లంకొండ: యువతకు అబ్దుల్ కలాం జీవితం ఆదర్శనీయమని ఎంపీడీవో వై.హనుమారెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కలాం చిత్ర పటానికి పూల మాలలు వేశారు. ఈవోపీఆర్డీ వెంకటరెడ్డి, ఏపీవో కోటమ్మ పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి



ముప్పాళ్ళ(సత్తెనపల్లి): కృష్ణా-గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు పట్టభద్రులు నవంబర్ 6లోగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కృష్ణా-గుంటూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు కోరారు. పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రజా సంఘాల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ లక్షణరావు గ్రాడ్యుయేట్లకు ఓటు నమోదుపై సూచనలు అందించారు. అనుముల లక్ష్మీశ్వరరెడ్డి, పెండ్యాల మహేష్, గుంటూరు మల్లీశ్వరి, గద్దె చలమయ్య, రవిబాబు పాల్గొన్నారు.

బాణసంచా పట్టివేత

మాచవరం: అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచాను పట్టుకున్నట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు. వివరాల ప్రకారం మాచవరం గ్రామానికి చెందిన కాకరపర్తి రామకృష్ణ ఇంట్లో దీపావళి మందులు అనుమతులు లేకుండా నిల్వ ఉంచారనే విశ్వనీయ సమాచారం మేరకు మంగళవారం దాడులు నిర్వహించగా, అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రమాదాల సెంటర్



వైన్ షాపు వద్ద చెరువులా రహదారి



బెల్లంకొండ ప్రధాన సెంటర్‌లో ప్రమాదకరంగా ఉన్న గుంతలు

బెల్లంకొండ: మండల కేంద్రంమైన బెల్లంకొండ సెంటర్‌కు రావాలంటే ప్రయాణికులు హడలిపోతున్నారు. ప్రధాన సెంటర్‌లోని నీటితో నిండిన గుంతలను చూసి ద్విచక్ర వాహనదారులు, పాదచారులు జంకుతున్నారు. గత రెండు నెలలుగా ప్రధాన సెంటర్ నుంచి వైన్‌షాపు వరకు ఏర్పడిన గుంతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పరిస్థితి ఇంకా అధ్వానంగా మారింది. కనీసం నడవడానికి కూడా వీలు లేకుండా గుంతలు నిండి పోయాయి. ప్రధాన సెంటర్‌లోని బస్‌స్టాప్ వద్ద గల గుంతలు ప్రమాదకరంగా మారాయి. అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని ప్రయాణికులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బీ అధికారులు స్పందించి గుంతలు పూడ్చి, మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

మిరప రైతులు.. జాగ్రత్తలు తీసుకోండి

వినుకొండ(నూజెండ్ల): ప్రస్తుతం కురుస్తున్న అధిక వర్షాలకు మిరప పంటలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని వినుకొండ ఉద్యాన అధికారి షేక్ నబీ రసూల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉరకెత్తిన పొలాల్లో మొక్కలు వెంటనే తేరుకోవడానికి లీటరు నీటికి 10 గ్రాముల యూరియా మరియు 10 గ్రాముల పంచదార కలిపిన ద్రావణాన్ని వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలన్నారు. మొక్కలు వడబడి, తలలు వాల్చినట్లయితే లీటరు నీటికి 5 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ కలిపిన ద్రావణాన్ని పిచికారి చేయాలన్నారు. ఇనుపధాతు లోపంతో మొక్కలు పాలిపోయినట్లు కనబడితే పది లీటర్ల నీటికి 50 గ్రాముల అన్నభేదితో పాటు ఒక నిమ్మ చెక్క రసం కలిపి పిచికారి చేయాలని తెలిపారు. కాపుతో ఉండి వాలిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొదుళ్ల చుట్టూ మట్టిని ఎగదోయాలన్నారు. నేల అదునుకు వచ్చిన వెంటనే గొర్రు వేసి అంతర కృషి చేసినట్లయితే వెంటనే ఆరుతుందని వివరించారు. పైపాటుగా ఎకరానికి అదనంగా 30 కిలోల యూరియా 15 కిలోల పొటాష్, 200 కిలోల వేపపిండి వేయాలన్నారు. బ్యాక్టీరియా, ఆకుమచ్చ, కోనోఫోర తెగుళ్ల, వేరుకుళ్లు, కాయకుళ్లు, కొమ్మ ఎండు తెగుళ్ల నివారణకు పలు జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు.